క్లుప్తంగా

ఒకేషనల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు



పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడటౌన్: స్థానిక ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఒకేషనల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు జరిగాయి. మూడు విభాగాలుగా జరిగిన ఈ పరీక్షల్లో మొత్తం 52 మందికి గాను 48 మంది హాజరైనట్లు ఎంఈఓ శేఖర్‌సింగ్ తెలిపారు. లెవల్-ఎ లో ఏడుగురు, లెవల్ బి-లో 15 మంది, లెవల్-సి లో 26 మంది పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. ప్రభుత్వం ఏ వయస్సువారైనా అర్హత పరీక్షల్లో పాల్గొనే అవకాశం కల్పించడంతో అన్ని వయస్సుల వారు పరీక్షల్లో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ జయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో బారులు తీరిన భక్తులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు వేచి ఉన్నారు. ముందుగా పాల పొంగళ్లను వండిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ పర్యవేక్షించారు.


26న రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన



తోట్లవల్లూరులోని రామాలయం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు లైన్‌బజారులో నూతనంగా నిర్మించిన రామమందిరం నందు శ్రీహనుమత్, లక్ష్మణ, సీతా సమేత కోదండరామచంద్రస్వామి వార్ల విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 25వ తేదీ బుధవారం ఉదయం 9.05 గంటలకు గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, రక్షాబంధన, దీక్షాధారణ, అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రధాన కలశస్థాపన, మూలమంత్ర హోమం, శాంతిహోమం, 26న ఉదయం 6.36 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, విగ్రహ ప్రతిష్ఠ జరుగుతాయని తెలిపారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎన్నార్‌కు ఘన నివాళి



ఏఎన్నార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడటౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 8వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, వాకర్స్ క్లబ్ సభ్యులు, ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏఎన్నార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అర్జా ప్రసాద్, వంగపండు బ్రహ్మాజీ, ఎల్ఈ వెంకటేశ్వరరావు, కోశాధికారి చింతా రామకృష్ణ, చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, వాకర్స్ అసోసియేషన అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, వీరయ్య, కోశాధికారి లక్ష్మణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బేతవోలు శాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో వనవలమ్మ జాతర

మచిలీపట్నంటౌన్: నిజాంపేటలోని నూతి వీరయ్య గారి ఆది వనవలమ్మ దేవి జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్మి చెట్టు వద్ద, అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలు డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు దర్శించుకుని పూజలు చేశారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే డీఎన్నార్
- ముదినేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



ముదినేపల్లిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా పేదల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండల కేంద్రమైన ముదినేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలన్నింటినీ అమలు చేసిందన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అనేక పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు పార్టీ, నామినేటెడ్ పదవుల్లో అధిక శాతం కేటాయించి ముఖ్యమంత్రి తన ఉదారతను చాటుకున్నారని చెప్పారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్ రైతులు పడుతున్న అవస్థలను ప్రత్యక్షంగా చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయోత్పత్తులకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల రైతులు మిల్లర్లు, దళారుల బారిన పడకుండా గరిష్ఠ ప్రయోజనం పొందుతున్నారన్నారు. నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 90 శాతం పైబడి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇంకా ధాన్యం ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వంపై పెరిగిన విశ్వాసం..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బెంబేలెత్తుతున్న ప్రతిపక్షాలకు భవిష్యత్తు ఉండదనే భయంతో అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని ఎమ్మెల్యే డీఎన్నార్ ధ్వజమెత్తారు. ప్రజలు దీనిని గ్రహిస్తూ పార్టీకి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. జగన్ వల్లనే సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటే అందుబాటులోకి వచ్చాయన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు పక్షపాతంగా వ్యవహరించి అర్హులైన ప్రజలకు పథకాలు అందకుండా చేశాయని విమర్శించారు. ప్రతి పనికీ లంచాలు మరిగి ప్రజల్లో ప్రతిష్ఠ పోగొట్టుకోవడంతో ఘోర ఓటమి మూటకట్టుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా వలంటీర్లు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నందున ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి భారీ మద్దతు లభించింది. ఎమ్మెల్యేకు పూలమాలలతో ఘనస్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యులు మరీదు నాగయ్య, జంపన కోటయ్య, కోటి ప్రవీణ్, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, మత్రివాడ వీరారెడ్డి, జాస్తి రాజేంద్రప్రసాద్, నర్రా వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, శొంఠి నాగరాజు, లేళ్ళ ఆంజనేయులు, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ, పలు శాఖల ఏఈలు శ్రీనివాసరావు, శేషగిరిరావు, రవికుమార్, ఈవోపీఆర్డీ విజయసారధి, వీఆర్వో మధుసుదనరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు



గుడివాడలో పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు



ప్రశ్నపత్రాలను తరలిస్తున్న పోలీసులు

గుడివాడటౌన్: పట్టణంలోని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల, వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నికల్ కళాశాలల్లో కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. డీఎస్పీ ఎస్.సత్యానందం, అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాలు పర్యవేక్షణ, ఇతర ఏర్పాట్లు జరిగాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఎస్పీ సత్యానందం తెలిపారు. మొత్తం గుడివాడ డివిజన్ పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 4,742 మంది అభ్యర్థులు హాజరు కావలసి వుండగా 4,077 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చిన వారిని సైతం పరీక్ష హాలుకు అనుమతించక పోవడంతో కొద్దిమంది కన్నీటి పర్యంతమయ్యారు.

గుడ్లవల్లేరులో 2,511 మంది హాజరు..

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ, వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీల్లో కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలు ఆదివారం జరిగాయి. 2,944 మందికి గాను 2,511 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇంజినీరింగ్ కాలేజీలో 1,672 మందికి 1,423 మంది అభ్యర్థులు, పాలిటెక్నిక్ కాలేజీలో 960 మందికి 823 మంది, ఫార్మసీ కాలేజీలో 312 మంది గాను 265మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎస్ఐ వి.ఏసేబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రాజన్, పీఈటీ రాము

జమీదగ్గుమిల్లి(పామర్రు): జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని జమీదగ్గుమిల్లి హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ రాజన్ అన్నారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఈనెల 20న ముస్తాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారన్నారు. అండర్ -17 లో మెరుగు నరేంద్ర, అండర్-14లో మెరుగు భవ్యశ్రీ, కూనపరెడ్డి సుష్మ మైత్రేయిని, కూన శివ నందిని ఎంపిక అయ్యారని తెలిపారు. వీరు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారన్నారు. మెరుగు దివ్య, కూనపరెడ్డి సుష్మ మైత్రేయినిలు 3 కిలోమీటర్ల నడక విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బాదర్ల రామును హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



గుడివాడలో ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

గుడివాడటౌన్: ద్విచక్ర వాహనం నడిపే వారిలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన వారంతా హెల్మెట్ లేని వారేనని డీఎస్పీ ఎస్ సత్యానందం అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డివిజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సీతాపతిరావు, గుడివాడ తహసీల్దార్ ఆంజనేయులుతో కలసి ఆయన హెల్మెట్ అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ఉండి ప్రాణాపాయ ప్రమాదాల్లో సైతం బయటపడిన అనేక కేసులు తాము గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అత్యంత తేలికపాటి మన్నిక కల్గిన హెల్మెట్‌లు అందుబాటులో వస్తున్నందున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణానికి భద్రత కల్పించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీఓ విజయసారథి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

మండవల్లిలో సీసీ రోడ్డు ప్రారంభం



మండవల్లి స్టేషన్‌రోడ్డులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం ప్రారంభించారు. స్థానిక గ్రామ సచివాలయానికి మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులలో రూ.5 లక్షలు సీసీ రోడ్డుకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఏ గ్రామంలోనూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వారి సౌకర్యార్థం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి వసతులు సమకూర్చుతున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, గుడివాడ మురళీకృష్ణ, మెండా సురేష్, మల్లేశ్వరాస్వామి ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు

కైకలూరు: ఆటపాక గ్రామ గంగానమ్మ ఆలయ 9వ వార్షిక సంబరాలను ఆదివారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, రామలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బందా నారాయణ, ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, సింగొశెట్టి రాము, కన్నా సాంబయ్య పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం లక్ష్మీ నరసింహపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గుడివాడకు చెందిన ఆర్కే హాస్పిటల్స్ సౌజన్యంతో సాయివరలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో ఎముకలు, గుండె, నరాలు తదితర వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో ఆర్ఎంపీ వైద్యుడు శ్యామ్ సుందర్‌రాజు ఈ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.ప్రశాంత్, శశాంక్, పవన్‌సాయి, పీఆర్వో ఓ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగూర్‌బాబు, ఎన్.కుటుంబరావు, టి.వెంకటేశ్వరరావు, హనుమంతు, శ్రీను పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

తోట్లవల్లూరు: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నట్లు గరికపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శివనాగమల్లేశ్వరరావు(చంటి) తెలిపారు. గ్రామానికి చెందిన రైతు బి.మధుసూదనరావుకు చెందిన వరికుప్ప తడిసిందన్నారు. దానిని నూర్పిడి చేయటం ద్వారా వచ్చిన 138 బస్తాలను(40 కేజీలు) యాకమూరులోని వెంకటేశ్వర ట్రేడర్స్‌కు విక్రయించామని శివనాగమల్లేశ్వరరావు చెప్పారు. తడిసిన ధాన్యం కావటంతో మిల్లర్ కొంత తగ్గించే ప్రయత్నం చేశాడని, అది మా దృష్టికి రావటంతో రైతుకు ఎలాంటి అన్యాయం జరగకుండా పూర్తి నగదు చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాము అమ్మిన ధాన్యానికి నగదు పూర్తిగా వస్తున్నందున రైతు మధుసూదనరావు, కౌలురైతు కొణతం సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు కేపీ రెడ్డయ్య సంస్మరణ సభ

గుడివాడటౌన్: మాజీ ఎంపీ, బీసీ నేత కేపీ రెడ్డయ్య యాదవ్ సంస్మరణ సభ స్థానిక ఎన్టీఓస్ హోమ్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఓస్ హోమ్‌లో సాయంత్రం 4.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని పెద్ద సంఖ్యలో సంఘ పెద్దలు, యువత, మహిళలు పాల్గొని ఆయనకు నివాళులర్పించాలని రాంబాబు కోరారు.

అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వెంకటాపురం పీఏసీఎస్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డీఎన్నార్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు

కైకలూరు(కలిదిండి): అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. కలిదిండి మండలం వెంకటాపురం నూతన పీఏసీఎస్ భవనాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తన్నీరు మట్లాడుతూ.. జిల్లాలో కేడీసీసీ బ్యాంకు ఉత్తమ సేవలు అందిస్తోందన్నారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌ను మెడల్ ప్రాజెక్టుగా భావించి లబ్ధిదారునికి రూ.2 లక్షలు రుణం అందించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ పంపించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామన్నారు. కేడీసీసీ బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ సేవలు అందించాలి

ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి పీఏసీఎస్‌లకు ఆన్‌లైన్ సేవలు అందించాలన్నారు. దీని వల్ల ఆ గ్రామాల్లో స్వయంశక్తి సంఘాలు బ్యాంకు లావాదేవీలు పీఏసీఎస్‌లోనే చేసుకునే వెసులుబాటు ఉంటుందని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గద్దె ఆనంద్, నాయకులు నంబూరి హరికృష్ణంరాజు, కందుల వెంకటేశ్వరరావు, షేక్ చాంద్ భాషా, ఊర కల్యాణి, సాగి సూర్యనారాయణరాజు, బాబీ, చార్లెస్, అంకెం నరసయ్య, కరేటి భాస్కర్, త్రిసభ్య కమిటీ సభ్యులు అర్జునరావు, నాగరాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లబ్ సేవలను విస్తృత పర్చాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

పామర్రు: క్లబ్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలను అందజేస్తూ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వాసవీ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బొగ్గరపు జాలయ్య సుబ్బరత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్‌ల ద్వారా 25 రకాల సేవలను నిరంతరం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యమస్తు, ఆలయాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, క్లబ్ సేవలపై అవగాహన శిబిరాలను నిర్వహించడం, అమ్మ ఆత్మగౌరవ కేంద్రాల ఏర్పాటు, అనాథలైన వృద్ధులకు పెన్షన్ల పంపిణీ చేయటం తదితర సేవలను క్లబ్‌ల ద్వారా అందజేయాలని పిలుపునిచ్చారు. తదుపరి నూతనంగా ఎంపికైన వాసవీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులైన చిన్నం ఆదినారాయణరావు, పూటుకూరి పిచ్చేశ్వరరావు, కంచర్ల వీరజనార్దనరావు, నూతనంగా ఎంపికైన వాసవీ వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులైన చిన్నం పద్మనాగ లక్ష్మీకుమారి, పూటుకూరి లత, కంచర్ల ఉషారాణిల చేత ప్రమాణం చేయించారు. అనంతరం నిరుపేదలైన వారికి నెలకు రూ.200ల చొప్పున దాతల సహకారంతో పెన్షన్‌లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మండా కమలాకరనాథ్, ఎం.వెంకటలక్ష్మి, జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి ఆలపాటి ప్రభాకరరావు, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా వైస్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరిశ వెంకట నాంచారయ్య, సభ్యులు కొత్త శివమోహన పుల్లారావు, బొగ్గరపు జాలయ్య, జి.భరతుడు, జి.సాయిరాం, త్రినాథ్‌రావు, తాళ్లూరి నరేష్, టి.వెంకట కృష్ణారావు, సనిశెట్టి లక్ష్మీజానకి, సురేష్ పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ




స్వామివారి చిత్రపటం అందుకుంటున్న అమరేంద్రకుమార్ దంపతులు

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ హెచ్‌ఓడీ డాక్టర్ అమరేంద్రకుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, మూర్తి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా జేడీ డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ మనోజ్, మోపిదేవి, పురిటిగడ్డ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మోపిదేవిలో వెటర్నరీ వైద్యశాలను సందర్శించారు. ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: కృష్ణానది రేవులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. చల్లపల్లి మండలం నడకుదురు లంకలో ఆదివారం పేకాట జరుగుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ కుడిపూడి శ్రీనివాసుకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశారు. పేకాట శిబిరాన్ని గుర్తించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,070లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు పాటించకపోతే వాహనాలు సీజ్



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

కోడూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోవాలాలకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. వాహనాల్లో పరిమితికి మించిన ప్రయాణికులను చేరవేస్తున్నారని, దీని వల్ల ప్రాణాలకే ప్రమాదమని ఎస్ఐ అన్నారు. నిబంధనల మేరకు ప్రయాణికులను తరలించాలని, ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు బ్యాడ్జీలను ధరించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, ఆర్సీ కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు. ఏఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాఘ మాస పూజలు ప్రారంభం



విశేష అలంకరణలో వెంకటేశ్వరస్వామి

పామర్రు: మాఘ మాసం ప్రారంభం ఆదివారం పాడ్యమిని పురస్కరించుకుని పలు వైష్ణవాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. స్థానిక విష్ణాలయం,నిమ్మకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పెరిశేపల్లి, పెద మద్దాలి,జమీగొల్వేపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధి రాపర్ల గ్రామంలో వేం చేసి ఉన్న గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలు, చందనం, పసుపు కుంకుమలతో విశేషంగా స్వామికి అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో పలు రకాల పుష్పాలతో అలంకరించి పూజించారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకుడు బి.పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని అలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కె.శివయ్య, బి.బాలాకుమారి, బి.నవ్య, కె.శ్రీహరి పాల్గొన్నారు.